ప్రజాశక్తి
మంగళవారం 7 అక్టోబర్ 2025
5
పార్వతీపురం మన్యం

రెవెన్యూ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక కలెక్టరేట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌ను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం ప్రారంభించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను ఆమె ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డితో కలిసి పరిశీలించారు. రెవెన్యూ క్లినిక్ విచ్చేసిన అర్జీదారులతో మంత్రి మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు అన్ని రకాల రెవెన్యూ సమస్యలు, రెవిన్యూ సర్వీస్ మేటర్స్ త్వరగా పరిష్కారమవుతాయని తెలిపారు. ఇంత మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కలెక్టరును మంత్రి అభినందించారు. అంతకుముందు రెవెన్యూ క్లినిక్ ద్వారా పరిష్కారం చేయబోయే వివరాలను జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మంత్రికి వివరించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వచ్చారు... వెళ్లారు

- మృతుల కుటుంబాలకు భరోసా ఇవ్వని మంత్రులు
- ఇంటి వద్దే మరణించారన్న సంధ్యారాణి
- గురుకుల పాఠశాలను సందర్శించిన అచ్చెన్నాయుడు
- జిల్లా ఆస్పత్రిలో విద్యార్థినులకు పరామర్శ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని కురుపాం గురుకుల పాఠశాలలో ఇద్దరు గిరిజన విద్యార్థినులు మరణించిన వారం రోజుల తర్వాత ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి చుట్టం చూపుగా వచ్చారు. పదోతరగతి చదువుతున్న గిరిజన బాలికలు పచ్చకామెర్లు వ్యాధితో మరణించారు. సెప్టెంబరు 25న తోయక అంజలి, అక్టోబర్ 1న కల్పన మృతి చెందారు. అంజలి నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన బాలికల పాఠశాలలో రక్షిత మంచినీటి సౌకర్యం లేకపోవడంతో బోరు నీటినే వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందుబాటులో వాటర్ ప్లాంట్ రెండేళ్ల క్రితం పాడైపోయింది. 600 మంది విద్యార్థులున్న పాఠశాలలో కేవలం 30 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. వీటిలో కూడా కొన్ని పని చేయడం లేదు. ఇరుకు గదుల్లో 40నుంచి 50 మంది పడుకోవాల్సిన పరిస్థితి ఉంది. భోజనం చేసే గదుల్లోనే నిద్రిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, మరుగుదొడ్లు లేవు. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వ్యాధులు ప్రబలే పరిస్థితి నెలకొంది. ఇద్దరు విద్యార్థుల మృతితో ఉలిక్కిపడిన జిల్లా యంత్రాంగం మొత్తం విద్యార్థులందరికీ ముందు జాగ్రత్తగా పరీక్షలు చేయించారు. 140 మంది విద్యార్థినులు చికిత్స పొందుతున్నారు. జిల్లా ఆసుపత్రిలో 96మంది, విశాఖపట్నం కెజి ఆసుపత్రిలో 44మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో 31 మంది పరిస్థితి నిలకడగా ఉందని జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. పాఠశాలకు వారం రోజుల పాటు సెలవులు ప్రకటించారు. ఇంత జరిగితే జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి, ఐటిడిఎ పిఓ యశ్వంత్ కుమార్ రెడ్డి దగ్గరుండి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఏర్పాట్లు చేశారు. కానీ స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గాని, జిల్లాలోనే ఉన్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి గాని పాఠశాల వైపు కన్నెత్తి చూడలేదు. కనీసం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించలేదు. అమరావతిలో ఉన్న గిరిజన గురుకుల సొసైటీ కార్యదర్శి గౌతమి వారి కంటే ముందు పాఠశాలను సందర్శించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న మంత్రులు అచ్చెన్నాయుడు, సంధ్యారాణి, ఎమ్మెల్యేలు

పాఠశాలలో సమస్యలు పరిశీలించిన ఆమె విద్యార్థుల మరణాలకు, అస్వస్థతకు కలుషిత నీరే కారణమని చెప్పారు. కానీ కురుపాం గురుకుల పాఠశాలకు కూతవేటు దూరంలో ఉన్న ఎమ్మెల్యే జగదీశ్వరి మృతుల కుటుంబాలకు పరామర్శించక పోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కూడా శనివారం సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకే విశాఖ వెళ్లి కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. ఆ తర్వాత ఆదివారం ఆమె జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో కలిసి జిల్లా ఆస్పత్రిలో విద్యార్థినులకు పరామర్శించారు. వారితోపాటు కురుపాం, పార్వతీపురం ఎమ్మెల్యేలు కూడా పరామర్శించారు.

మృతుల కుటుంబాలకు భరోసా ఇవ్వని మంత్రులు

సంఘటన జరిగిన వారం రోజుల అనంతరం ఆదివారం రాష్ట్ర మంత్రులు సంధ్యారాణి, అచ్చెన్నాయుడు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందు తున్న విద్యార్థినులను పరామర్శించారు. కానీ మృతుల కుటుంబాలకు ఏ విధమైన భరోసా ఇవ్వలేదు. మరణించిన ఇద్దరు బాలికలు వారి ఇళ్ల వద్దే మృతి చెందారని, పరిహారం చెల్లించడం సాధ్యం కాదన్న రీతిలో మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. అయితే సిఎం చంద్రబాబునాయుడుతో మాట్లాడి సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

తాగునీటి సమస్య లేదు

కురుపాం గురుకుల పాఠశాలలో తాగునీటి సమస్య లేదని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆసుపత్రులకు పరామర్శ అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. పాఠశాలలో వాటర్ ప్లాంట్ మరమ్మతు చేస్తున్న సమయంలో విద్యార్థినులకు వేడి నీటిని పంపిణీ చేసినట్లు తెలిపారు. పాఠశాలలో ఒక మరుగుదొడ్డిని ఎక్కువ మంది వినియోగించడం, నిర్వహణ సరిగ్గా చేయకపోవడం వల్లనే పచ్చకామెర్లు విస్తరించాయని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖపై సిఎం చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తు న్నారని, ఆశ్రమ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకున్నారని చెప్పారు. తాగునీటి పరీక్షలు నిర్వహించగా నీరు కలుషితం కాలేదని తేలిందని చెప్పారు. గత ఐదేళ్ల లో వైసిపి ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు కనీసం కంచాలు, దుప్పట్లు పంపిణీ చేయలేదన్నారు. విద్యార్థుల మరణాలు, అస్వస్థతను వైసిపి నాయకులు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. సిఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గాడిదలు కాస్తున్నారా అని వైసిపి అధినేత జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. గిరిజన మహిళా మంత్రినైన తనపై గాడిదలు కాస్తున్నారనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సిఎం చంద్రబాబు నాయుడును విమర్శించే అర్హత జగన్‌కు లేదన్నారు. గతంలో జిల్లా నుంచి డిప్యూటీ సీఎంలుగా పని చేసిన పుష్ప శ్రీవాణి, రాజన్నదొర ఏం చేశారని ప్రశ్నించారు. కురుపాంలో పాముకాటుతో హాస్టల్ విద్యార్థి మరణించలేదా అని నిలదీశారు.

మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి

ఆదివాసీ జెఎసి ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా
మంత్రులను కలిసేందుకు ప్రయత్నించిన నాయకుల గెంటివేత

ప్రజాశక్తి - పార్వతీపురం

పచ్చకామెర్లతో మృతి చెందిన ఇద్దరు విద్యార్థినుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ జెఎసి ఆధ్వర్యాన నాయకులు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎజెఎసి చైర్మన్ నిమ్మక జయరాజు ఆధ్వర్యాన జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ధర్నా నుద్దేశించి జయరాజు మాట్లాడుతూ గిరిజన గురుకుల పాఠశాలలో మరణించిన విద్యార్థుల కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి కనీసం పరామర్శిం చకపోవడం దారుణమన్నారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కూరంగి సీతారాం మాట్లాడుతూ పాఠశాలలో 600 బాలికలు చదువుతుంటే కనీస సౌకర్యాలు లేవన్నారు. వాటర్ ప్లాంట్ రెండేళ్లుగా పని చేయడం లేదన్నారు. 20 మరుగుదొడ్లు ఉన్నా కొన్ని పని చేయడం లేదని చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచినప్పుడే తమ పిల్లలను పాఠశాలకు పంపిస్తామని, అంతవరకు పంపించేది లేదని స్పష్టం చేశారు. చావడానికి తమ పిల్లలను పాఠశాలకు పంపించబోమని, చదువుకోడానికి మెరుగైన సౌకర్యాలు వున్నప్పుడు మాత్రమే పంపిస్తామని విద్యార్థి తల్లి పత్తిక దీప చెప్పారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్, గిరిజన నాయకులు సీతారాం, చంద్రశేఖర్, గౌరమ్మ పాల్గొన్నారు.

గిరిజన నాయకుల గెంటివేత

జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన విద్యార్థినులను పరామర్శించేందుకు వస్తున్న ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిను కలిసి వినతిపత్రం అందజేయడానికి గిరిజన నాయకులు అక్కడికి చేరుకున్నారు. మృతి చెందిన విద్యార్థి తోయక అంజలి తల్లిదండ్రులతో కలిసి పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కూరంగి సీతారాం, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్ ఆసుపత్రి వద్ద

గిరిజన సంఘ నాయకులను ఆసుపత్రి నుంచి బయటకు గెంటుతున్న పోలీసులు

ఉన్నారు. ఇంతలో అక్కడికి చేరుకున్న స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర గిరిజన సంఘాల నాయకులను చూసి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివనాగజ్యోతిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజన సంఘాల నాయకులను ఎందుకు లోపలికి అనుమతించారని, వారిని బయటకు పంపించాలని ఆదేశించారు. దీంతో సూపరింటెండెంట్ సూచనలు మేరకు పోలీసులు గిరిజన సంఘాల నాయకులను బలవంతంగా బయటకు లాక్కెళ్లారు. తాము మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని అడగడానికే వచ్చామని, మంత్రులను కలిసి వినతిపత్రం అందజేస్తామని గిరిజన నాయకులు చెప్పినా టౌన్ ఎస్ఐ జగదీష్ నాయుడు ఆధ్వర్యాన పోలీసులు వారిని లాక్కెళ్లి గేటు బయట వదిలేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు టిడిపి ప్రభుత్వం హయాంలో తీరని అన్యాయం జరుగుతోందని విమర్శించారు.

ఇన్‌ఛార్జి మంత్రి రావడం, వెళ్లడమేనా?

సమస్యలు పరిశీలించారా ?
ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి - కురుపాం

మన్యం జిల్లా ఇన్చార్జ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రావడం వెళ్లడం తప్ప పాఠశాలలోని సమస్యలను కనీసం పరిశీలించిన దాఖలాల్లేవని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, కూరంగి సీతారాం మండిపడుతు న్నారు. సోమవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో వారం రోజుల వ్యవధిలో పువ్వల అంజలి, తోయిక కల్పన మృతి చెందిగా సుమారు 130 మంది విద్యార్థులు అనారోగ్యం బారిన పడి జిల్లా కేంద్ర ఆస్పత్రి, కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారన్నారు. ఇంకా మిగిలిన విద్యార్థుల రక్త నమూనాలు సేకరించినా ఇంతవరకు ఫలితాలు రాక కోసం తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారన్నారు. ఈ సమయంలో సోమవారం పాఠశాల సందర్శనకు ఇన్చార్జి మంత్రి అచ్చెన్నాయుడు రావడం సంతోషకరమైనప్పటికీ కనీసం పాఠశాల పరిసర ప్రాంతాల్లోని మరుగుదొడ్లు, వంటగది, డైనింగ్ హాలు, తరగతి గదులు, కనీస మౌలిక సదుపాయాలు పరిశీలించకపోవడం ఆశ్చర్యారకమన్నారు. పక్కనే ఉన్న ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు, తల్లిదండ్రులకు వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ అక్కడికి వెళ్లే దాఖలాల్లేవన్నారు. కేవలం ప్రిన్సిపాల్ గదిలో కూర్చుని వైద్య, ఇంజినీరింగ్ అధికారులు, పాఠశాల సిబ్బందితో మాట్లాడి విద్యార్థుల అనారోగ్యానికి గల కారణాలు తెలుసుకొని గురుకుల పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, మౌలిక వసతులు కల్పిస్తామని, చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందిస్తా మని విలేకరులతో మాట్లాడి వెళ్లిపోయారని అన్నారు. సమస్యలను క్షుణంగా పరిశీలించే దాఖలాల్లేవని, అక్కడి వరకు వచ్చి పాఠశాలలోని మౌలిక వసతులు ఎందుకు పరిశీలించలేదని ప్రశ్నించారు. సిఎం గిరిజన విద్యార్థులు ఆరోగ్యంపై ఆరా తీస్తే గానీ స్థానిక ఎమ్మెల్యే, ఇన్చార్జ్ మంత్రి, గిరిజన సంక్షేమ మంత్రికి చలనం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి మిగతా విద్యార్థులకు సేకరించిన రక్త నమూనాల ఫలితాలను ప్రకటించాలని, గిరిజన సంక్షేమ ఆశ్రమ గురుకుల పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు, మినరల్ వాటర్ ప్లాంట్లను సక్రమంగా కల్పించాలని డిమాండ్ చేశారు.

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరం సోమవారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయం నుంచి కోట వరకు ఘటాలు ఊరేగింపుగా వెళ్లి కోటలోని రౌండ్ మహల్‌లో ఘటాలు ఉంచి పూజలు చేశారు. అనంతరం కోట ఎదురుగా ఘటాలను ఉంచి పూజారి రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తొలేళ్ల ఉత్సవంలో పాల్గొన్నారు.

ఘనంగా తొలేళ్ల ఉత్సవం

పైడితల్లమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన ఆలయ ధర్మకర్త అశోక్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాన్సాస్ చైర్మన్, పైడితల్లి అమ్మవారి ఆలయం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు కుటుంబ సభ్యులు ఎంఎల్ఎ అదితి విజయలక్ష్మి గజపతిరాజు తదితరులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయనకు ఆలయ పూజారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతర ఆయన మీడియాతో మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర, జిల్లా ప్రజలపై ఉండాలన్నారు. ఆలయ అభివృద్ధి పనులు వచ్చే ఏడాది నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే అతిథి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం రూ.1.80కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. 9,10 తేదీల్లో ఆలయ ధర్మ కర్త చేతులు మీదుగా శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందన్నారు. వారి వెంట ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న అశోక్ దంపతులు

పూజలు చేస్తున్న మంత్రులు అనిత, శ్రీనివాస్

ఘటంతో వస్తున్న చిన్నారి

పోటెత్తిన భక్తులు

తొలేళ్ల ఉత్సవం నేపథ్యంలో సోమవారం అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి మూడు లాంతర్ల నుంచి అర్బన్ బ్యాంకు రోడ్డు వైపు, మరోవైపు ఆలయం నుంచి ఎంజి రోడ్డు వైపు చందన బ్రదర్స్ షాపు వరకు భక్తులు క్యూ కట్టారు. ఘటాలతో నగరం ఇరువైపుల నుంచి అధిక సంఖ్యలో మహిళలు ఆలయానికి చేరుకున్నారు.

అదిరే.. అదిరే

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట, టౌన్, కంటోన్మెంట్

విజయనగర ఉత్సవాల్లో భాగంగా మహారాజ సంగీత కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. రెండో రోజైన సోమవారం నిర్వహించిన కార్యక్రమాలలో 36 బృందాలు ప్రదర్శనలు ఇచ్చాయి. నాదస్వరం, గాత్రం, వీణ, ఫ్లూట్, వయోలిన్, మృదంగంతో పాటు కూచిపూడి, భారత నాట్యం ప్రదర్శనలు ఉన్నాయి. సుమారు 300 మంది కళాకారులు ప్రతిభను చాటారు. ప్రదర్శన అనంతరం వేదిక ఇన్‌ఛార్జులు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత, ఎపిఆర్ఒ ఎస్.జానకమ్మ, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి మండపాక నాగలక్ష్మి కళాకారులకు మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేసి, దుశ్శాలువతో సత్కరించారు.

నృత్యం చేస్తున్న కళాకారిణులు

గుబాళించిన సాహిత్య సౌరభం

సకల కళలకు సమాహారంగా నిలిచిన విజయనగరంలో సాహిత్య సౌరభం గుబాళించింది. విజయనగరం ఉత్సవాలలో భాగంగా జరిగిన కవి సమ్మేళనం ఆద్యంతం అలరించింది. సుమారు 120 మంది కవులు తమ కవితలను పఠించారు. కవి సమ్మేళనంలో జిల్లా కేంద్రానికి చెందిన రచయిత, తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ తనదైన శైలిలో దేవులపల్లి కృష్ణశాస్త్రిపై కవితా పఠనం గావించారు. ఈ సందర్భంగా గురుప్రసాద్‌ను సంస్కృత కళాశాల ప్రాచార్యులు జనార్దన్ నాయుడు ఘనంగా సత్కరించారు.

నృత్యం చేస్తున్న కళాకారిణులు

పైడితల్లమ్మ సైకత శిల్పం

సంగీత కళాశాలకు పూర్వ వైభవం : ఎంపి

సంగీత కళాశాలను అభివృద్ధి చేసి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తానని ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. సంగీత కళాశాలలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి, కళాకారులను సత్కరించారు. వేదిక ఇంచార్జ్‌లు కవిత, జానకమ్మ, నాగలక్ష్మి లను అభినందించారు.

ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవితను సత్కరిస్తున్న ఎంపి కలిశెట్టి

ఉర్రూతలూగించిన మ్యూజికల్‌నైట్

విజయనగరం కోట : విజయనగరం ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్థానిక అయోధ్య మైదానంలో ఏర్పాటు చేసిన మ్యూజికల్ నైట్.. ఆహూతులను ఉర్రూతలూగించింది. గాయని గీతామాధురి.. లాలా దర్వాజు, రబ్బరు గాజులు పాటలతో అందరితో చిందేయించారు. ఎమ్మెల్యే అదితి, ఎమ్మెల్సీ గ్రీష్మ.. గీతామాధురి పాటలకు స్టెప్పులు వేసి, కార్యక్రమానికి మరింత ఊపు తెచ్చారు.

గర్జించిన ఆదివాసీలు... దద్దరిల్లిన ఐటిడిఎ

గిరిజన సమస్యలు పరిష్కరించాలని చలో సీతంపేట

ప్రజాశక్తి - సీతంపేట

ఏళ్ల తరబడి గిరిజన సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తమ హక్కులను, చట్టాలను కాల రాస్తున్నారని, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పెద్ద ఎత్తున ఆదివాసీ సంఘాల (ఐకాసా) ఆధ్వర్యంలో చలో సీతంపేట కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఉదయాన్నే చుట్టుపక్కల గిరిజన గ్రామాల నుంచే కాకుండా ఇతర మండలాల నుంచి సీతంపేట సంత మార్కెట్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి గిరిజనులు శాంతియుత ర్యాలీతో ఆదివాసీలు ర్యాలీ చేశారు. అనంతరం స్థానిక బస్టాండ్ వద్ద మానవహారం చేపట్టారు. జీవో 3ను పునరుద్ధరించాలని, స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలని, 1/ 70 చట్టం పగడ్బందీగా అమలు చేయాలంటూ ప్లేకార్డులతో నినాదాలు చేశారు. అనంతరం సీతంపేట ఐటిడిఎ వరకు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఐటిడిఎను సీతంపేటలోనే కొనసాగించాలని,

ఐటిడిఎ వద్ద బైఠాయించిన గిరిజన జెఎసి నాయకులు

రెగ్యులర్ పిఒను నియమించాలని, ఖాళీగా ఉన్న పోస్టులు గిరిజనులచే భర్తీ చేయాలని నినాదాలతో ఐటిడిఎ దద్దరిల్లింది. ర్యాలీ వద్దకు ఎపిఒ చినబాబు రావడంతో గిరిజనులు పిఒ రావాలంటూ ఐటిడిఎ వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ ఆదివాసీల రక్షణకై ఏర్పడిన ఐదో షెడ్యూల్ ఏరియాలో ఆదివాసీల హక్కులు రక్షించాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ, గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ, ఉద్యోగులను, బదిలీలు, ప్రమోషన్లను ఐటిడిఎ, గురుకుల బైలా ప్రకారం నియమాకాలు చేపట్టాలని కోరారు. సీతంపేట ఐటిడిఎను ఇక్కడే కొనసాగించాల న్నారు. షెడ్యూల్ ప్రాంతంలో 100శాతం ఉద్యోగ కల్పనపై నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని ఐటిడిఎల్లో వర్క్ షాప్ ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయ సేకరణ చేసినట్టుగా సీతంపేట ఐటిడిఎ కూడా వర్క్ షాప్‌ను ఏర్పాటు చేయాలన్నారు. 1/70 పీసా అట్రాసిటీ చట్టాలను పట్టిష్టంగా అమలు చేయాలన్నారు. కొండపోడు, ప్రభుత్వ భూములకు పట్టాలిచ్చి రక్షణ కల్పించి ప్రభుత్వం రాయితీలు పొందేలా రక్షణ కల్పించాల న్నారు. ప్రతి మండలం కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలని , అన్ని ఆదివాసీ గ్రామాలను షెడ్యూల్ ఏరియా హోదా కల్పించా లన్నారు. షెడ్యూల్ ప్రాంత చట్టాలు ఆదివాసీ వీరుల చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలన్నారు. అనంతరం ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జెఎసి అధ్యక్షులు బి.శ్రీవాసరావు, ఎంపిపి ఆదినారా యణ, ఆదివాసీ ఐకాస నాయకులు బి.ఉమా మహేశ్వరరావు, రామ్మోహన్ రావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు, నాయకులు నిమ్మక కాంతారావు, సాయికుమార్, మోహన్‌రావు, దమయంతి నాయుడు, సర్పం చులు కూర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

సెక్షన్ 30 నిబంధనలను సడలించాలని వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలో అమలు చేస్తున్న సెక్షన్ 30 నిబంధనలను సడలించాలని, ప్రజా ఉద్యమాలపై నియంత్రణ, నిర్బంధం తొలగించాలని వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వం విధిస్తున్న నిర్బంధాన్ని ఎత్తివేయాలని, ఇప్పటికే ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన రౌడీషీట్లు తొలగించాలని డిమాండ్ చేశారు. దీనికి ఎస్పీ స్పందిస్తూ ముందస్తు అనుమతులపై నిబంధనలు సవరిస్తామని, ఇప్పటికే విధించిన రౌడీ షీట్‌లు తొలగించేందుకు దర్యాప్తు నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.కృష్ణమూర్తి, బివి రమణ, గొర్లి వెంకటరమణ, సిపిఐ నాయకులు ఆర్‌విఎస్ కుమార్, రైతు కూలీ సంఘం నాయకులు వర్మ, శ్రీనివాస నాయుడు, ఎం.భాస్కరరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు పోల ఈశ్వరరావు, కృష్ణ, బి.నర్సింగరావు, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, కాంగ్రెస్ నాయకులు గౌరీ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు



ఎస్‌పికి వినతిని అందజేస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

జాబ్ మేళా వాయిదా
ప్రజాశక్తి - పార్వతీపురం

భామిని ఏపీ మోడల్ స్కూల్ నందు మంగళవారం జరగాల్సిన జాబ్ మేళాను కొన్ని అనివార్య కారణాల వలన వాయిదా వేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగ యువతీ యువకులు దీన్ని గమనించాలని, ఈ అసౌకర్యానికి చింతిస్తున్నట్లు ఆయన తెలిపారు. తదుపరి తేదీ త్వరలో ప్రకటించడం జరుగుతుందని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

104 జిల్లా మేనేజర్ ఆకస్మిక తనిఖీ
ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలో 104 వాహనం వైద్య సేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని 104 జిల్లా మేనేజర్ ఎస్. కృష్ణ అన్నారు. సోమవారం పిహెచ్‌సిలో ఉన్న 104 వాహనంలో ఉన్న ఎక్విప్‌మెంట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పలు వివరాలను అడిగి వాహనంలో అన్ని రికార్డులు, మందుల లభ్యతను పరిశీలించారు. వాహనాన్ని తనిఖీ చేసి, పరిస్థితిని పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది ఉన్నారు.

8న మెగా నేత్ర వైద్య శిబిరం
ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని సాయి నగర్ కాలనీలో శ్రీసత్య సాయి బాబా మందిరంలో ఈనెల 8న మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీ సత్య సాయి సేవ సమితి నిర్వాహకులు సోమవారం ప్రకటనలో తెలిపారు. విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించనున్నామని, దీర్ఘకాలిక కంటి సమస్యతో బాధపడుతున్న రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శిబిరానికి వచ్చే వారు ఆధార్, రేషన్ కార్డుతో పాటు మొబైల్, బ్యాంక్ ఖాతా పుస్తకం, ఒక జత బట్టలు, ప్లేటు, గ్లాసు తమ వెంట తప్పనిసరిగా తీసుకురావాలని నిర్వాహకులు కోరారు.

9,10న సొంత ఆదాయ వనరులపై శిక్షణ
ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 9, 10 తేదీల్లో సొంత ఆదాయ వనరులపై సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంకాలం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. మండలంలోని 34 పంచాయతీలకు సంబంధించిన సర్పంచులు, కార్యదర్శులు తప్పనిసరిగా శిక్షణకు హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ ఎంపికలు
ప్రజాశక్తి - బలిజిపేట

ఈనెల 7, 8 తేదీల్లో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ -1 ఎస్.సింహాచలం తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో స్కూల్ గేమ్స్ నిర్వాహణ పై పిఇటిలతో సమావేశం నిర్వహించారు. అనంతరం హైస్కూల్ హెచ్ఎం, పిఇటిలతో కలిసి పోటీలు నిర్వహించే మైదానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ 7న కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, 8న చెస్, ఖోఖో, అథ్లెటిక్స్ మొదలైన పోటీలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ హైస్కూల్ హెచ్ఎం [illegible], వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ సుభాని, డి.సీతంనాయుడు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులను ఈ ఎంపికలకు పంపించాలని ఎంఇఒ కోరారు.

సమాచారం అడిగిన వెంటనే అందించాలి
ప్రజాశక్తి- సాలూరు

సమాచారం అడిగిన వెంటనే అందించే విధంగా ఉండాలని, ఎఒ కె.శిరీష అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా వచ్చిన దరఖాస్తులకు 30 రోజులు లోగా సమాచారం అందివ్వాలని లేని యెడల సమాచార హక్కు చట్టంలో పొందుపరిచిన విధంగా సెక్షన్ల ప్రకారం ఉన్నతాధికారులకు సంజాయిషీతో పాటు జరిమానా కూడా చెల్లించాల్సిన పరిస్థితులు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ ఉద్యాన శాఖ సహాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత
ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

నియోజకవర్గ స్థాయిలో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. సోమవారం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బారులో వచ్చిన పలు వినతులను ఆయన స్వీకరించారు. తక్షణమే పరిష్కరించవలసిన సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. అనంతరం సీతానగరం మండలం లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యపై అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సందర్భంగా ఎమ్మెల్యేను కార్మికుల మర్యాద పూర్వకంగా కలుసుకొని అభినందనలు తెలియజేశారు.

పంచాయతీ ఏర్పాటు చేయాలని వినతి
ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివెంద్రి సచివాలయం పరిధిలో ఉన్న ఎస్ గోపాలపురం, గోపాలపురం కాలనీ, దశమంతపురం, సింధు నగర్, పెద్దూరు, వీరఘట్టం మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న అచ్చపువలస గ్రామాలన్నింటినీ పంచాయతీగా ఏర్పాటు చేయాలని, గిరిజనులు సోమవారం ఎంపిడిఒ బి.వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ ఐదు గ్రామాల్లో సుమారు 900 మంది జనాభా నివాసం ఉంటున్నారని, 750 మంది ఓటర్లు ఉన్నారని, తమకు అనుసంధానమైన పంచాయతీలు దూరంగా ఉన్నందున రేషన్ బియ్యం, ధ్రువ పత్రాలు కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఈ విషయమే సిఎం చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు పంచాయతీ ఏర్పాటు చేయాలని కొరియర్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నిమ్మక నగేష్, జీవ, బి.ఆనంద్‌రావు, బి.రాజు, ఏ ఆనందరావు, బి సుందర్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహనాయుడు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ
ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడిమికెళ్ల సచివాలయం పరిధి కడకల్లా గ్రామానికి చెందిన మర్రాపు నరసింహనాయుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం ఆ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నరసింహనాయుడు కుమారుడు ఉమామహేశ్వరరావుతో మాట్లాడి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, సర్పంచ్ డొకల సుజాత- శ్రీనివాసరావు, వైసిపి నాయకులు జి.గౌరీశంకర్, ఎం.శంకర్రావు, బి.సూర్యనారాయణ, పాలకొండ పట్టణ వైసిపి అధ్యక్షులు వెలమల మన్మథరావు, కౌన్సిలర్లు కడగల వెంకటరమణ, దుప్పాడ పాపినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: పట్టణంలోని నాగవంశం వీధికి చెందిన కృష్ణసాయి కుటుంబానికి సోమవారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పరామర్శించారు. ఇటీవల కృష్ణసాయి సీతంపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆ కుటుంబాన్ని పరామర్శి ఓదార్చారు. ధైర్యంగా ఉండాలన్నారు. ఆయనతో పాటు పట్టణ వైసిపి అధ్యక్షులు వెలమలమన్మథరావు, దుప్పాడ పాపినాయుడు, కడగల రమణ, టి.శంకర్రావు, పల్లా భాను ఉన్నారు.

లుంబూరులో గ్రామసభ
ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని లుంబురులో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభకు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర కుమార్ అధ్యక్షత వహించగా, వచ్చే ఏడాదికి ఉపాధి పనుల కోసం సుమారు రూ.కోటీ 50 లక్షలు అంచనా ప్రతిపాదనలు తయారు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతులకు మేలు చేసే పనులు మాత్రమే చేపట్టాలన్నారు. అందుకు పూర్తి సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రోజారమణి మాజీ సర్పంచ్ రౌతు సోంబాబు, కొండు చిన్నమనాయుడు, వి.దుర్గారావు తదితరులు ఉన్నారు.

ప్రధాన రహదారిపై కూలిన భారీ వృక్షం
ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

మండలంలో సోమవారం సాయంత్రం వీచిన భారీ ఈదులుగాలులకు ఏకలవ్య పాఠశాల సమీపాన భారీ భారీ వృక్షం నేలకూలింది. దీంతో గుమ్మలక్ష్మీపురం, బత్తిలి, ఒడిశా ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాలు నిలిచిపోయాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఏళ్ల నాటి వృక్షాలు కాలం చెల్లడంతో ఈదురుగాలులకు కూలుతున్నాయని ప్రజలు అంటున్నారు. వీటిపై ఆర్ అండ్ బి అధికారులు దృష్టి సారించి తొలగించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు..

చిత్తశుద్ధితో సమస్యలు పరిష్కరించండి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేశామని, అవకాశం మేరకు అర్జీదారుని సమక్షంలోనే అక్కడికక్కడే సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమస్యల పరిష్కారంతో అర్జీదారులు సంతృప్తి చెందాలని, ఆ దిశగా పరిష్కారం ఉండాలని కలెక్టర్ హితవు పలికారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన పిజిఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 100 మంది అర్జీదారుల నుంచి వినతులను జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన రెవెన్యూ క్లినిక్ ద్వారా త్వరతగతిన పరిష్కారం కావాలని తెలిపారు. వీలైనంత వరకు అర్జీదారు సమక్షంలో సమస్య పరిష్కారమైతే వారు ఆనందపడతారని అన్నారు. ప్రతి అర్జీని క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్

ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

లబ్ధిదారునికి వినికిడి పరికరం పంపిణీ

వీర ఘట్టం మండలం నర్సిపురం నుంచి బిడ్డక రమణమూర్తి అర్జీని కలెక్టరుకు అందిస్తూ, తనకు వినికిడి సమస్య ఉందని, కావున వినికిడి పరికరాన్ని మంజూరు చేయాలని కోరారు. తక్షణమే కలెక్టర్ స్పందిస్తూ జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ప్రతినిధిని ఆదేశిస్తూ వినికిడి పరికరాన్ని అర్జీదారునికి కలెక్టర్ పంపిణీ చేశారు. అర్జీ ఇచ్చిన వెంటనే తన సమస్య తీరడం పట్ల అర్జీదారుడు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్‌పి ఆధ్వర్యాన....

పార్వతీపురంటౌన్ : స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 7 అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారించి, ఫిర్యాదు అంశాల్లో వాస్తవాలు ఉన్నట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ ఆదాం, ఎస్సై రమేష్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏనుగులను కాపాడండి

పార్వతీపురం టౌన్: మన్యం జిల్లాలో సంచరిస్తున్న ఏనుగులను కాపాడాలని, వాటి నుంచి ప్రజల ప్రాణాలను రక్షించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డికి కాంగ్రెస్ పార్టీ మన్యం జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు ఏనుగుల సమస్యపై వినతి పత్రాన్ని అందజేసి చర్చించారు. ఆదివారం పార్వతీపురం మండలం లక్ష్మీనారాయణ పురం గ్రామ పరిసరాలలోని ముదిరాజ్ చెరువులో గున్న ఏనుగు హరి మృతి చెందిన విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఇప్పటివరకు జిల్లాలో ప్రవేశించిన ఏనుగుల్లో వివిధ ప్రమాదాల్లో సుమారు 8 ఏనుగులు మృత్యువాత పడినట్లు తెలిపారు. ఏనుగుల జాతి అంతరించిపోకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు. 2017లో ఒడిస్సా నుంచి జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగులు ఇప్పటివరకు సుమారు 11మంది వ్యక్తులను పొట్టన పెట్టుకున్నాయని, సుమారు రూ.6 కోట్ల విలువైన ఆస్తులను ధ్వంసం చేశాయని, ఏనుగుల సమస్యను పరిష్కరించాలని కోరారు.

సమస్యలపై వినతులు

సీతంపేట: గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని పలువురు గిరిజనులు విన్నవించారు. సోమవారం పిజిఆర్ఎస్‌ను ఐటిడిఎలో ఎపిఒ చినబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కేసరకు చెందిన చినబాబు ఇంటి పక్కన ఉన్న చింత చెట్టు తొలగించాలని విన్నవించారు. జజ్జువ చెందిన సులోమి స్టాఫ్ నర్స్ పోస్ట్ ఇప్పించాలని, రాయిమనుగూడకు చెందిన సింగన్న పవర్ టిల్లర్ లోన్ ఇప్పించాలని, ఇప్పగూడకు చెందిన పెద్దింటి వేణు గుమ్మడి నుంచి ఇప్పగూడ గ్రామానికి మంజూరైన రహదారి పూర్తి చేయాలని, ఎగువ చింతలాపోలూరుకు చెందిన సన్యాసి గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని, కిరపకు చెందిన రమేష్ బాబు మినీ రేషన్ డిపో మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఇ రమాదేవి, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్‌రావు, పిహెచ్‌ఒ వెంకట గణేష్, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ విజయ పార్వతి, ఎఒ వాహిని తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించండి : జెసి

పార్వతీపురం: రెవెన్యూ సమస్యలతో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా అందిన దరఖాస్తులపై జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా గత వారంలో వచ్చిన అర్జీలపై కేసుల వారీగా మరియు కేటగిరీ వారీగా పెండింగ్‌లో ఉన్న మరియు పరిష్కరించబడిన అన్ని దరఖాస్తులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మ్యుటేషన్, సంబంధిత రెవెన్యూ విషయాల కోసం నిజమైన దరఖాస్తులను అక్కడికక్కడే అంగీకరించి నమోదు చేసుకోవాలన్నారు. అలాగే సంబంధిత విభాగాల అధికారులతో సమన్వయం చేసుకొని నిజమైన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చూసుకోవాలని సూచించారు. అదనపు ఆదాయ సంబంధిత ఫిర్యాదులను పరిష్కరించాలని, సత్వర పరిష్కారాన్ని చూపాలని జెసి ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌ఒ కె.హేమలత, ఇతర రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం

● హరితాంధ్ర ప్రదేశ్‌కు అంతా కృషి చేయాలి ● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

ప్రజాశక్తి - పార్వతీపురం

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతగా గుర్తెరగాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. తద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తెలిపారు. సోమవారం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో స్వచ్ఛ ఆంధ్ర జిల్లా స్థాయి అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమం ఆమె అధ్యక్షతన జరిగింది. ముందుగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరక్టర్ లక్ష్మణరావులతో కలిసి మంత్రి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ రోజు 48 మందికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను ప్రధానం చేసుకుంటున్నామని, వారందరికీ అభినందనలు తెలిపారు. ప్రతి ఇంటిలో ఆడబిడ్డలు, మహిళల ఆత్మ గౌరవాన్ని కాపాడేలా అందరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి నెల మూడవ శనివారం ఎస్ఎఎస్ఎ ను కచ్చితంగా అమలుచేయాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లాస్థాయి అవార్డులను అవార్డు గ్రహీతలకు ఇతర అతిథులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ డా. ఎన్. ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే టి.జగదీశ్వరి, బి.విజయచంద్ర మాట్లాడారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, స్వచ్ఛ ఆంధ్ర అవార్డు గ్రహీతలు తదితరులు పాల్గొన్నారు.

అవార్డులను ప్రదానం చేస్తున్న మంత్రి సంధ్యారాణి

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- సీతానగరం

ఎంఇఒ ఎం.సూర్యదేవుడు ఆధ్వర్యంలో జోగంపేట డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కెజిబివిలో విద్యార్థులకు సోమవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ముందుగా ఎంఇఒ పిల్లల హాజరు, భోజన సదుపాయం, మరుగుదొడ్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడమే గాక, విద్యార్థుల ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ జొన్నాడ సంధ్య, రాజారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని పెద్దూరు, మూలలంక, చినగోర కాలనీ, గాదిలంక, ఎస్.గోపాలపురం, అచ్చపువలస తదితర గిరిజన గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలో సోమవారం వైద్య సిబ్బంది విద్యార్థులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరాలు ఉంటే రక్త పూతలు సేకరణ, దగ్గు, జలుబు, ఏ రకమైన వ్యాధులున్నా మందులు పంపిణీ చేశారు. వాతావరణంలో మార్పు వచ్చిన కారణంగా వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, వీటిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు కాచిన నీరు ఇవ్వాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ప్రభుత్వ భూముల కబ్జా

ప్రజాశక్తి - బలిజిపేట

అధికారుల అలసత్వమో... పాలకుల నిర్లక్ష్యంగా గానీ సాక్ష్యాత్తూ మండల రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న మెట్ట కాలనీ రోడ్డుకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. కొంతమంది రాజకీయ నాయకుల అండతో ఆక్రమించి ఆ స్థలం చుట్టూ కంచె వేశారు. ప్రజా ప్రయోజనాల కోసం గతంలో అధికారులు ఈ మెట్టపై మంచినీళ్ల ట్యాంకు కట్టాలని భావించారు. సెంటు భూమికి పట్టా తీసుకొని చుట్టూ కంచె వేసుకొని విక్రయిస్తున్నారు. బలిజిపేటకు చెందిన ఓ వ్యక్తి ఏకంగా 20ఇళ్లకు సరిపడా స్థలాన్ని ఆక్రమించి చుట్టూ గోడకట్టాడు. సెంటు జాగా లేక ఒకపక్క పేదలు అల్లాడుతుంటే మరోపక్క ప్రభుత్వ భూమిని ఇలా కంచె వేసి సొంత ప్రయోజనానికి వాడుకోవడం ఎంతవరకు న్యాయమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ యంత్రాంగం స్పందించి ప్రభుత్వ భూములు కాపాడాలని, ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి

విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వి.ఇందిర డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. కురుపాం ఆశ్రమ పాఠశాలలో అనారోగ్యంతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడంతో పాటు అనేకమంది ఆసుపత్రుల పాలవ్వడం చాలా దురదృష్టకర మన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ. 50లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లించి ఆ కుటుంబాలకు భరోసా కల్పించాలని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అందరి విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ప్రతి ఆశ్రమ పాఠశాలలో ఎఎన్ఎంలను నియమించి ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి వారి ఆరోగ్యపై దష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు, గిరిజన సంఘం నాయకులు కొల్లి సాంబమూర్తి, హిమరిక రామారావు, గిరిజన విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు

ఏకలవ్య పాఠశాలలో వైద్య పరీక్షలు

పర్యవేక్షించిన జిల్లా వైద్యశాఖ అధికారి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక గురుకుల పాఠశాలకు సమీపంలో ఉన్న ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు కూడా అనారోగ్యం బారిన పడుతున్న నేపథ్యంలో సోమవారం విద్యార్థులకు, తల్లిదండ్రులకు వైద్య పరీక్షలను జిల్లా వైద్య శాఖ అధికారి ఎస్.భాస్కరరావు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 364 మంది విద్యార్థులు ఉండగా బాలురు 34, బాలికలు 33మంది, తల్లిదండ్రుల 35, సిబ్బందికి 8 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. రక్త నమోనాలను జిల్లాకు తరలించామని, ముందస్తు జాగ్రత్తలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది అందరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అవసరమైన వారిని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి వైద్యం అందజేస్తామన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ భాస్కరరావు

పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

పక్కా భవనం నిర్మించే వరకూ పిల్లలను బడికి పంపమని ఉద్ఘాటన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఇరిడిలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పక్కా భవన నిర్మాణం పూర్తయినంత వరకు తమ పిల్లలను బడికి పంపే ప్రసక్తే లేదని తల్లిదండ్రులు స్పష్టం చేశారు. ఇటీవల కురిసిన తుఫానుకు పాఠశాల తాత్కాలిక రేకుల షెడ్ నీట మునిగిపోవడంతో విద్యార్థుల చదువుకు ఆటంకంగా మారింది. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం పాఠశాల ముందు నిరసన చేపట్టారు. ఇరిడిలో ఎన్నో ఏళ్ల నుంచి పాఠశాల భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో తాత్కాలికంగా రేకులు షెడ్డులోనే విద్యార్థులకు చదువు చెబుతున్నారన్నారు. పాఠశాల పక్కా భవనం నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులకు, జిల్లా కలెక్టర్ కు విన్నవించినప్పటికీ పనులు ప్రారంభించలేదన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి ఇరిడిలో నిర్మిస్తున్న పాఠశాలను వేగవంతంగా నిర్మించేందుకు అధికారులను ఆదేశించాలని కోరారు.

నిరసన తెలుపుతున్న పిల్లల తల్లిదండ్రులు

కళాసీలు, యజమానుల మధ్య కుదిరిన ఒప్పందం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలో ప్రతి రెండేళ్లకొకసారి కిరాణా కొట్టు కళాసీలకు, యాజమాన్యులకు మధ్య పీసి రేటు ఒప్పందం కుదిరింది. గత ఒప్పందం సమయం ముగియడంతో మళ్లీ కొత్త వేతన ఒప్పందం చేసుకోవాల్సిన ఉన్న నేపథ్యంలో యజమానులు తోట నాగేశ్వరరావు, తోట సుబ్బారావు, రైస్ మిల్ అండ్ హమాలీలు, సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు నాయకులు, సత్యనారాయణ, ఆవాలు తవుడు, శ్రీను మధ్య 20 శాతం పీసి రేట్ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం 2027 వరకు అమల్లో ఉంటుంది. కార్యక్రమంలో కళాసీలు వెంకటప్పయ్య, అప్పన్న, ముత్యాలు, దేవుడు, సత్యము, సోంబాబు, తదితరులు పాల్గొన్నారు

మృతుల కుటుంబాలకు పరామర్శ
ప్రజాశక్తి - కురుపాం

స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన ఇద్దరు గిరిజన విద్యార్థినిల కుటుంబ సభ్యులను మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను వారి పిల్లలు పువ్వల అంజలి, తోయక కల్పన పడిన ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఒక్కొక్క కుటుంబానికి రూ.2లక్షలు చొప్పున ఎక్స్ గ్రేషియోను త్వరలో అందిస్తామన్నారు.

విద్యార్థుల మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే

గుమ్మలక్ష్మీపురం: కురుపాం గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు మరణాలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలేనని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ కంబగూడ గ్రామానికి వెళ్లి పువ్వల అంజలి కుటుంబ సభ్యులను సోమవారం సాయంత్రం పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరులతో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం, వైద్యాధికారుల నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థులు మరణాలు జరిగాయని అన్నారు. అంతే తప్ప పసర మందు వాడి చనిపోలేదని ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తుందని అన్నారు. పువ్వల అంజలి దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం పొందినట్లుగా రికార్డులో ఉన్నాయన్నారు. విద్యార్థులు చదువుతున్న చోట సరైన సౌకర్యాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం ఒక్కొక్క విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

తవిటిరాజుకు అవార్డు
ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రస్థాయిలో ఉత్తమ శానిటేషన్ వర్కర్ అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సోమవారం అమరావతిలో సాలూరు మున్సిపల్ శానిటేషన్ వర్కర్ తవుడురాజు అందుకున్నారు. ఈ మేరకు తవిటి రాజును మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ టిటి రత్నకుమార్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ సిబ్బంది అభినందనలు తెలిపారు

అవార్డు అందుకుంటున్న తవిటిరాజు

గురుకులాన్ని సందర్శించిన జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్
ప్రజాశక్తి - కురుపాం

స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను సోమవారం కురుపాం జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్యజోస్పిన్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గల కిచెన్, విద్యార్థులు ఉంటున్న తరగతి గదులు, పరిసర ప్రాంతాలను పరిశీలించి ఇన్చార్జి ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మితో మాట్లాడి విద్యార్థులు అనారోగ్యం బారిన పడిన, మృతి చెందడానికి గల కారణాలను ప్రస్తుతం వైద్యం పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితుల గురించి ఆరా తీశారు. విద్యార్థులకు పౌష్టికాహారం, పాఠశాల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.

బంగారు ఆభరణాల దొంగ అరెస్టు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని నొంద్రుకోన పంచాయతీ, కొత్తవలసలో గతనెల 12న సీమల కొండలరావు ఇంట్లో జరిగిన చోరీకి సంబంధించిన దొంగను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. కొండలరావు ఇంటికి ఆశా వర్కర్‌నని చెప్పి ఒక వ్యక్తి వచ్చాడు. మీ ఇంట్లో ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతున్నారా అని ప్రశ్నించగా, లేదని కొండలరావు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం వారు పనికి వెళ్లిపోయారు. ఎవరు లేరని గమనించి ఆ వ్యక్తి కొండలరావు ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న రెండు ఉంగరాలు, ఒక జత చెవి దిద్దులు, తులమున్నర బంగారాన్ని దొంగతనం చేశాడు. ఈ మేరకు తమ విచారణలో గుమ్మలక్ష్మీపురం మండలం పెద్దకర్జకు చెందిన పల్లెరిక సురేష్‌గా గుర్తించామని అన్నారు. సోమవారం సురేష్ గుమ్మలక్ష్మీపురం బస్ స్టాండ్ ఆవరణలో సంచరిస్తుండగా ఎల్విన్ పేట ఎస్ఐ శివప్రసాద్, సిబ్బంది అతడ్ని పట్టుకొని దొంగతనం గురించి ఆరా తీయగా దొంగతనం తానే చేసినట్లు సదరు సురేష్ ఒప్పుకున్నాడని తెలిపారు. ఈ మేరకు ముద్దాయి సురేష్‌ను ఎస్ఐ అరెస్టు చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

పార్వతీపురం టౌన్: 33/11 కెవి కొత్తవలస సబ్ స్టేషన్‌లో ఆర్‌డిఎస్-ఎస్ వర్క్స్ బే ఎక్స్‌టెన్షన్ వర్క్ జరుగుతున్న కారణంగా 11 కెవి వాటర్ వర్క్స్ ఫీడర్, 11కెవి అడ్డపుశీల ఫీడర్, 11 కెవి చంద్రంపేట ఫీడర్ పైన ఉన్న గ్రామాల్లో మంగళవారం విద్యుత్తుకు అంతరాయం కలుగుతోందని ఎఇ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందనీ ప్రజలు సహకరించాలని కోరారు.